తెలుగు కళాసమితి
(న్యూజెర్సీ)
చిన్నకథల పోటీలో
మూడవ బహుమతి
రు. 300/- లు
గెలుచుకున్న రచన




బాల్యంలోనే ఒంటబట్టిన పలుకుబడి పైరవీల కాలుష్యాన్ని కడిగేసే కంప్యూటర్లే వుంటే...

**వాతావరణ కాలుష్యం మీద జరుగుతున్న సెమినార్ కి ఆహ్వానం వచ్చింది.**

ఒక పుష్కరం తరువాత హైదరాబాద్ చూసే అవకాశం వచ్చింది. అంతేకాదు నగర పొలిమేరల్లో వున్న ఖానాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్తు స్కూల్లో కలిసి చదువుకున్న నా స్నేహితుల్ని ఇద్దర్ని కలుసుకునే అదృష్టం కలిగింది. సంతోషంతో బయలుదేరాను ఢిల్లీనుండి.

నా ఉత్తరం చూసుకుని, సెమినార్ అవగానే నా బసకు వచ్చి, సత్యం, శంకరయ్యా నన్ను ఎంతో ఆప్యాయంగా వాళ్ళ ఊరు తీసుకు పోయారు. గ్రామానికి పోయే గతుకుల రోడ్డు అలానే వుంది. గాంధీ బొమ్మ అలానే వుంది. కానీ, ఏదో చౌకబారు రంగు పులిమినట్టున్నారు. గాంధీగారి ముఖంలో విషాదచ్ఛాయలు ముసురు కున్నట్లు అనిపించింది నాకు.

ఆ రోజుల్లో నేనూ, శంకరయ్య, సత్యం కలిసి చదువుకునే వాళ్ళం. అంజయ్యా, యాదగిరీ మాకంటే కొంచెం పెద్దవాళ్ళే కానీ పరీక్ష, తప్పి మా క్లాసులోనే వుండేవారు. వాళ్ళను చూస్తే మాకు కొంత క్రేజ్, హీరో వర్షిప్ ఆ రోజుల్లో వున్నమాట నిజమే. మాకులేని స్వేచ్ఛ వాళ్ళు అనుభవించే వారు. కొత్త టీచర్లను ఏడిపించేవారు. ఎవరో సినీ హీరో పేర అభిమాన సంఘం నడిపి మొదటి రోజునే కొత్త సినిమాకు టిక్కెట్లు సంపాదించేవారు. బ్లాకులో అమ్మి మేం చూస్తూ వుండగా నోట్లు లెక్క పెట్టుకునే వారు. ఎలక్షన్ల రోజుల్లో గ్రామ సర్పంచి, హెడ్ మాస్టరుకు చిట్టీ పంపి వీళ్ళని రప్పించుకునే వాడు. ఎన్నికలు రేపు అవగా ఎవరెవరి ఇళ్ళకు తాళాలు వున్నాయో, ఎవరు ఊర్లోలేరో చూసి చెప్పడం, వాళ్ళ ఓట్లు ఎవరిచేత వేయించాలో ఏర్పాటు (ఇంతి జాం) చెయ్యడం వీళ్ళ డ్యూటీ. వాళ్ళకున్న పలుకుబడికి మాకు ఆ చిన్న వయసులో ఎంతో ఈర్ష్య కలిగేది. మమ్మల్ని కూడా వాళ్ళలో చేరమని ఆహ్వానించేవారు. అలాంటి సమయంలో ఆ ఆకర్షణలోంచి తప్పించి మాకు ఒక కొత్త మలుపు ఇచ్చినవాడు కొత్తగా వచ్చిన రంగనాయకులు టీచరే అని చెప్పకతప్పదు.

ఆయన మొదటి క్లాసులో అంజయ్యా, యాదగిరీ ఇకిలించారు, సకిలించారు. కానీ, రంగనాయకులు కోపం తెచ్చుకోలేదు. ప్రశాంతంగా రెండు మాటలు స్పష్టంగా చెప్పారు. "కాపీలు కొట్టి, పేపర్లు సంపాదించి మాటికి మార్కులు తెచ్చుకునే అడ్డుదార్లు ఇవాళా రేపూ వుంటాయి. పరీక్ష పాసు అవడానికే అయితే నా క్లాసులో వుండక్కరలేదు. నిజమైన చదువు చదువుకుని మీకు జరుగుతున్న మోసాన్ని అర్థం చేసుకోగలగాలి. మీలాంటి సాటి ప్రజల్ని మోసంలోంచి అన్యాయంలోంచి రక్షించాలి. అలాటి చదువు కావాలంటే నా పాఠం వినండి. వద్దనుకుంటే అటెండెన్సు వేసుకుని వెళ్ళిపోవచ్చు" అన్నారు. తరువాత కాలం-దూరం లెక్కలు చెప్పారు. టెలిఫోన్ స్తంభం బొమ్మ వేశారు. ఒక రైలు బొమ్మ గీశారు. స్తంభం దాటడమంటే ఆ రైలు దాని పొడుగు ఎంత ఉందో అంతదూరం ప్రయాణం చెయ్యాలని చూపించారు. అందరు పిల్లలచేత చిన్నచిన్న ప్రశ్నలు

వేసి, సమాధానం రప్పించి ఒక రైలు ఎంత వేగంగా ప్రయాణం చేస్తోందో అంచనా వెయ్యడం సులభంగా బోధ పర్చారు. ఆయన పాఠం పిల్లల్ని ఆకటు కుంది. ఆ ఏడు అందరం మంచి మార్కులతో పాస్ అయ్యాం. అలా జరిగిన బాల్యం మేం ముగ్గురం నెమరువేసుకున్నాం.

సాయంత్రం దాటినాక మూడు విడతలుగా ఏదో వాసన గాలిలో వచ్చి కడుపులో తిప్పింది. నాకు వాంతి అయింది. "ఏమిటి వాసన" అన్నాను. "ఏదో మందుల కంపెనీ వాడు ఈ మధ్య రెండేళ్ళయి ఎక్కువగా ఇలాటి గ్యాసు గాలిలోకి వదుల్తున్నాడు. భావిలో నీళ్ళు కూడా కషాయం రంగులో వుంటాయి" అన్నాడు శంకరయ్య. సత్యం ఒక పెద్ద ఫైల్ తెచ్చి నా ముందు వుంచాడు. దానిలో సత్యం పత్రికలకు వ్రాసిన ఉత్తరాలూ, సర్పంచ్‌కీ, శాసనసభ్యుడికీ చేసిన ఫిర్యాదులూ చూపించాడు. శంకరయ్య సత్యం అంత అమాయకుడు కాదు. "ఇప్పుడు సర్పంచ్ ఎవరనుకున్నావు? మనతో చదువుకున్న అంజయ్య. ఎమ్మెల్యే ఎవరనుకున్నావు యాదగిరి. వీళ్ళు ఎలక్షన్ల ముందు ఈ కాగితాలూ, కంప్లయింట్లు చూపించి మందుల కంపెనీ వాడి దగ్గర బాగా డబ్బూ, ఓట్లూ కూడా గుంజుకున్నారు. మాజీ ఎం.పి. బినామీగా అతని తమ్ముడి పేర నడుపుతున్న మాయదారి కంపెనీ అది. పారిశ్రామిక చట్టాలు పాటించి, వ్యర్థ పదార్థాలు విడగొట్టాలంటే లక్షలు ఖర్చు. ఇలా గాలిలో నీటిలో వదిలేస్తే చౌకగా గడిచిపోతుంది. అంజయ్యా యాదగిరీ మన గ్రామంలో వుండరు. సిటీలో కాపురం" మరునాడు ఉదయం నేను వా బసకు పోతూ వుంటే దినపత్రికలో పడ్డ ఏదో వార్తను చదివి సత్యం కొండెక్కినంత సంతోషిస్తు న్నాడు. పైకి చదివి వినిపించాడు కూడా. "కాలుష్యాన్నీ వ్యర్థ పదార్థాల్నీ కాలువల్లోకీ, నదుల్లోకీ వదలి వెయ్యడం పారిశ్రామికులకు అలవాటైపోయింది. ఇకపై ఆటకట్టు నీరు కలుషితం కాగానే ఆ సంగతి ఎన్నో మైళ్ళ దూరంలో వుండే మానిటర్‌కి తెలియజేసి అలారం మ్రోగించగల పరికరాన్ని ఉత్తర ఐర్లాండ్ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.


శంకరయ్య శాంతంగా విని "అవి మనకి పనికి రావయ్యా, దేశం నిండా అలారమ్‌లో మ్రోగి మ్రోగి శబ్ద కాలుష్యం కూడా పెరుగుతుంది. ఇప్పుడు కాలుష్యం ఎవరు చేస్తున్నారో తెలియక కాదు మన బాధ. వాళ్ళని నిర్మొహ మాటంగా నిలదీసి శిక్షించే కంప్యూటర్లు కావాలి. వాటిని ప్రజలే కనిపెట్టాలి కానీ......" అన్నాడు. ఉత్సాహభంగంతో అవాక్కయిన సత్యాన్ని చూస్తే చిన్నతనం రోజులు జ్ఞాపకం వచ్చాయి.

"సత్యం మారలేదు" అనుకున్నాను జాలిగా.

●

## వన్యప్రాణుల పురోహితుడు

ఇటీవల యువతీ యువకులకు సంబంధాలు కుదర్చడంలో కంప్యూటర్ల పాత్ర అందరికీ తెలిసిందే




ఇప్పుడు వన్యప్రాణులకు వివాహాలు జరపడంలో కూడా కంప్యూటర్లు ముందున్నాయి. ఢిల్లీకి చెందిన వన్య ప్రాణుల సంస్థ దేశంలోని వన్యప్రాణు లకు సరైన సంబంధాలను కుదర్చడా నికి ఓ కంప్యూటర్‌ను కొన్నారు. దేశంలోని జంతు ప్రదర్శనశాలల లోని ప్రాణులన్నింటికి ఇది సంబం ధాలు కుదురుస్తాయి. అన్ని ప్రాణుల వివరాలను కంప్యూటర్‌లో ఫీడ్ చేస్తు న్నారు. అప్పుడే ఈ కంప్యూటర్ ఎలుగుబంటి, సింహం, పులి మొద లైన క్రూర జంతువులకు, కోతి వంటి చిన్న జంతువులకు సంబంధాలు కుదు రుస్తోంది కూడా.


-జి. రమ, హైదరాబాద్.

## విశ్వనాథ పలుకు-

## విరుల తేనె చినుకు

మాటలో కరుకుదనం, మనస్సు సుమ కోమలం, పరిపూర్ణ సారస్వత పరిజ్ఞానం యీ మూడు గుణాల కలబోత ఆకృతి దాల్చితే, ఆ మూర్తి శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారన డంలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు. వారు మాట్లాడే పద్ధతి యెలా వుంటుందో తెలిపే సంఘటన యిది. ఒకసారి వీరి ప్రతిభా విశే షాలను విన్న బందరు కుర్రవాడొకడు వీరిని కలవాలనే కోరికతో యింట్లో వాళ్ళకి తెలియ కుండా చేతికందినంత డబ్బు తీసుకుని విజయవాడ చేరాడు. అంతకుముందతను విశ్వనాథ వారిని చూడలేదు. దారిన పోయే వాళ్ళను అడిగి తెలుసుకుని యెలాగోలా వారింటికి వెళ్ళాడు. ఇతను తలుపు తట్ట గానే లోపలి నుండి ఒక పెద్ద ముత్తైదువ వచ్చి తలుపు తీశారు.

' ఇతడు, "అమ్మా విశ్వనాథ సత్యనారాయణ గారున్నారా?" అని అడిగాడావిణ్ణి. "ఆ, లోపలి కొచ్చి కూర్చోమని చెప్పి ఆమె లోనికి వెళ్ళి పోయారు. అది మంచి ఎండాకాలం, ఆవ కాయల సీజను. ఇతగాడు లోనికి వెళ్ళి పూరు కోక, మాటిమాటికీ లేచి లోపలి గదుల లోనికి తొంగి చూడడం మొదలు పెట్టాడు. అక్కడికి కొద్ది దూరంలో వున్న వంట యింట్లో, మామిడికాయల రాసి ముందు కూర్చుని వాటిని వూరగాయకని తరుగుతూ, పంచె యెగగట్టుకొని వుండి, కారే చెమటను అంగోస్త్రంతో తుడుచుకుంటూన్న వృద్ధుడు ఒకరు కనిపించాడతనికి. ఆయన బహుశా ఆ యింట్లో వంటవాడేమోననుకొని, "అయ్యా, సత్యనారాయణగారు భోంచేస్తున్నారా," అని కాస్త గట్టిగా అడిగాడితను ఆయనముద్దేశించి. ఆ వృద్ధుడు తలయెత్తి యితనిని చూచి, "యిలా రా" అన్నారు.




ఇతడు వెళ్ళగానే "నీ పేరేమిటి?" అన డంతో రంగారావు అని బదులిచ్చాడితను.

"ఏం చదువుతున్నావు?" అని మళ్ళీ ప్రశ్నిం చాడాయన. ఇతను "ఇంటర్మీడియెట్ సెకం డియర్" అని జవాబిచ్చాడు.

"ఏ వూరు మీది? ఎవరబ్బాయివి?" అని మరో ప్రశ్న వేసేసరికి ఇతడు విసిగిపోయి, "ఇంతకీ సత్యనారా......" అని మాట పూర్తి చేసే లోపల, "ఆయనతో నీకేం పని?" మళ్ళీ అడిగారా వృద్ధుడు.

"పనేం లేదు. ఆయన చాలా గొప్పవారని తెలిసి వూరికే చూచిపోదామని వచ్చాను" అన్నాడతను.

"నీలాంటి వెధవాయిలందరికీ నా పని మానుకుని కూర్చుని ధర్మ దర్శనం యిస్తా నని నేనేం బోర్డు కట్టుక్కూర్చోలేదు. ఐనా ఏం చూస్తావు నన్ను నీ పిండాకూడు! వచ్చిన నాడిని యెలాగూ వచ్చావు రః కాయలు నాలుగూ తరిగిపో. వాక్కాస్త పనన్నా తప్పు తుంది!" అనేసరికి యితను నిలువు గుడ్లేసుకు చూస్తూండిపోయి "అంటే ... మీ ... మీరేనాండి ... సత్యనారాయణగారంటే" అంటూ చప్పున వారికి సాష్టాంగ దండ ప్రణామం చేసేశాడు.

వెంటనే విశ్వనాథవారు చిరునవ్వుతో యితడ్ని లేవనెత్తి "నేను చదవవలసిన వాడ్నే కాని, చూడవలసిన వాడ్ని కాదు" (కవినే కానీ, నటుడ్ని కాదు అని అంతరార్థం) అని చెప్పి, ఆ పూట భోజనం కూడా పెట్టించి, ఇతను చదవగలిగిన పుస్తకాలను కొన్నిటినిచ్చి మరీ పంపారు. అలా వుండేది ఆ మహనీయుని వైఖరి.

— పి.సరస్వతి

వారం వారం
స్మైల్ సాహితీ మణిహారం
సాహితీ ప్రియులను, సారస్వతాభిమానులను
ఖాళీ సీసాలు కథా రచయిత శ్రీ స్మైల్
వారం వారం అపురూపంగా
పలకరించనున్నారు.